అగ్రనేత
తెలుగు దిన పత్రిక
TELTEL/2015/66279
రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :152 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: మంగళవారం 13-08-2024 | పేజీలు:4 వెల: 2.00

## ఎడారి రాష్ట్రాన్ని ముంచెత్తిన వర్షం.. 20 మంది మృతి

రాజస్థాన్ :ఉత్తర భారతదేశాన్ని గత కొన్ని రోజులుగా భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. దేశరాజధాని ఢిల్లీ సహా ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్ (రాజస్థాన్) రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. తాజాగా ఎడారి రాష్ట్రం రాజస్థాన్‌ను భారీ వర్షం ముంచెత్తింది. శనివారం నుంచి కురుస్తున్న కుండపోత వర్షానికి చాలా ప్రాంతాలు నీట మునిగాయి. జైపూర్, కరౌలీ, సవాయ్ మాధోపూర్, దౌసాలో వర్షం దంచికొట్టింది. ఇక ఈ వర్షానికి రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 20 మంది ప్రాణాలు కోల్పోయారు.రానున్న 24 గంటల్లో రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. అయితే అప్రమత్తమైన అధికార యంత్రాంగం ముందు జాగ్రత్త చర్యలు చేపట్టింది. ఈ మేరకు జైపూర్, జైపూర్ రూరల్, దౌసా, కరౌలి, సవాయ్ మాధోపూర్, గంగాపూర్, భరత్‌పూర్‌లలో సోమవారం పాఠశాలలను మూసివేస్తున్నట్లు (స్కూల్స్ షట్) ప్రకటించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చెరువులు, వాగులు వద్దకు వెళ్లరాదని అధికారులు తెలిపారు. వర్షం పడుతున్న సమయంలో విద్యుత్ స్తంభాలు, తీగలకు దూరంగా ఉండాలని సూచించారు.

# తెలంగాణలో కండ్లముందే సాగు విస్తీర్ణం ఢమాల్



హైదరాబాద్: కాంగ్రెస్ పాలనలో వ్యవసాయానికి గడ్డుకాలం వచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ (కేటీఆర్) అన్నారు. ఏడాది కాలంలోనే రాష్ట్రంలో 15.30 లక్షల ఎకరాల్లో సాగు విస్తీర్ణం తగ్గిందని చెప్పారు. దేశానికే అన్నపూర్ణగా ఎదిగిన రాష్ట్రంలో ఎనిమిది నెలల్లోనే ఎందుకింత విధ్వంసం అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో రైతులకు భరోసా లేదన్నారు. బురద రాజకీయాలు తప్ప సమయానికి సాగు నీళ్లిచ్చే సోయి అసలే లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి మాటలు కోట్లు దాటుతున్నయ్, కానీ చేతలు మాత్రం సచివాలయం గేటు దాటడం లేదని ఎద్దేవా చేశారు. ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు అన్నదాతలది అత్యంత దయనీయ పరిస్థితి అంటూ ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. 'కేసీఆర్ పాలనలో సాగుకు స్వర్ణయుగం, కాంగ్రెస్ రాగానే వ్యవసాయానికి గడ్డుకాలం. ఇది కాంగ్రెస్ సర్కార్ చేసిన కమాల్.. తెలంగాణలో సాగు విస్తీర్ణం కళ్ళముందే ఢమాల్. ఒక్క ఏడాదిలోనే 15.30 లక్షల ఎకరాల్లో తగ్గిన సాగు విస్తీర్ణం, ఆగమైతున్న తెలంగాణ రైతు బతుకు తొలి ప్రమాద సంకేతం..! దశాబ్ద కాలంలోనే దేశానికే అన్నపూర్ణగా ఎదిగిన తెలంగాణలో ఎనిమిది నెలల్లోనే ఎందుకింత వ్యవసాయ విధ్వంసం..?. సంతోషంగా సాగిన సాగులో ఎందుకింత సంక్షోభం..??.మొన్న వ్యవసాయానికి కరెంట్ కట్, నిన్న రుణమాఫీలో రైతుల సంఖ్య కట్, నేడు సాగయ్యే భూమి విస్తీర్ణం కట్. రుణమాఫీ అని మభ్య పెట్టి పెట్టుబడి సాయాన్ని ఎగ్గొట్టడం వల్లే రైతులకు ఈ అవస్థ. రూ.500 బోనస్ అని నిలువునా మోసం చేసింది ఈ కాంగ్రెస్ వ్యవస్థ. ముఖ్యమంత్రి మాటలు కోట్లు దాటుతున్నయ్, కానీ చేతలు సచివాలయం గేటు దాటడం లేదు.ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు అన్నదాతలది అత్యంత దయనీయ పరిస్థితి. కాళేశ్వరం ప్రాజెక్టును వాడుకునే విజన్ లేదు, రిజర్వాయర్లు నింపే ప్రణాళిక లేదు, చెరువులకు మళ్లించే తెలివి లేదు. ఒక్క మాటలో చెప్పాలంటే కాంగ్రెస్ పాలనలో రైతు బతుకుకు భరోసా లేదు. బురద రాజకీయాలు తప్ప సమయానికి సాగు నీళ్లిచ్చే సోయి అసలే లేదు.పంటలు-విత్తనాల కోసం రైతులకు తిప్పలు, క్యూలైన్‌లో పాసుబుక్కులు, చెప్పులు. కొత్త రుణాల కోసం బ్యాంకుల వద్దే పగలూ రాత్రి తేడాలేకుండా పడిగాపులు. అప్పుల బాధతో అన్నదాతల ఆత్మహత్యలు, కౌలు రైతుల బలవన్మరణాలు. ఇలా ఒకటా రెండా.. సాగు విస్తీర్ణం తగ్గడానికి కారణాలు.. సవాలక్ష!!'

# బంగ్లా ఎఫెక్ట్ : తెర పైకి హిందూ రాష్ట్ర డిమాండ్ ?



న్యూఢిల్లీ,దేశంలో హిందూ రాష్ట్ర డిమాండ్ మరోసారి పురుడు పోసుకుంటోంది. ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం ట్యాగ్ భారత్ కి ఉంది. దాంతో పాటు అతి పెద్ద హిందూ దేశంగానూ భారత్ కి గుర్తింపు ఉంది. మొత్తం 143 కోట్ల మంది భారతీయులలో వంద కోట్ల దాకా హిందువులు ఉన్న దేశంగా ఉంది.ఇక భారత్ తరువాత నేపాల్ హిందూ దేశంగా ఉండేది. కానీ అక్కడ వామపక్ష ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చి సెక్యూలర్ బాట పట్టించాయి. తిరిగి హిందూ దేశంగా నేపాల్ ని గుర్తించాలని డిమాండ్ ఉంది. ఇక పోతే భారత్ పొరుగు దేశాలలో హిందువులకు ఎలాంటి రక్షణ లేదు అన్నది పాకిస్తాన్,ఆఫ్ఘనిస్తాన్ లో జరిగే నర మేధాలు రుజువు చేశాయి. బంగ్లాదేశ్ లో హిందువులు ఈ మధ్య దాకా ప్రశాంతంగానే ఉన్నారు. పైగా ఒక ముస్లిం దేశంలో అత్యధిక శాతం అంటే 12 శాతం హిందువుల జనాభా ఉన్నది బంగ్లాదేశ్ లోనే.అయితే షేక్ హసీనా రాజీనామాతో బంగ్లాదేశ్ లో హిందువులు నరకం చూస్తున్నారు. విద్యార్థులు రిజర్వేషన్ల కోసం లేవనెత్తిన ఉద్యమాన్ని మత చాందసవాదులు హైజాక్ చేసి హిందువుల మీద పడ్డారు. వారి మాన ధన ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. దాంతో ఎక్కడ చూసినా దారుణమైన సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి.ఈ నేపథ్యంలో నుంచి చూసినపుడు హిందువులు అక్కడ బిక్కుబిక్కుమంటున్నారు. దాంతో వారంతా ధైర్యం కూడదీసుకుని ఈ నెల 9న బంగ్లా వీధుల్లోకి వచ్చారు. లక్షలాది మంది హిందువులతో అతి పెద్ద ర్యాలీ నిర్వహించారు. సుప్రీంకోర్టుతో పాటు అన్ని ప్రభుత్వ భవనాలను హిందూ జనాలు దిగ్బంధనం చేశారు.తమను తామే రక్షించుకుంటామని అంటున్నారు. ఒక విధంగా బంగ్లాలో హిందువులు తెగువ చూపించారు. ఈ నేపథ్యంలో సెక్యులర్ దేశంగా ఉన్న భారత్ లో హిందువులు ఈ రోజుకు బాగానే ఉన్నా రానున్న దశాబ్దాలలో పరిస్థితి ఏమిటి అన్న చర్చ అయితే సాగుతోంది.ఎక్కడైతే హిందువులు మైనారిటీలుగా మారుతారో అక్కడ వారు నరకం చూస్తారని పొరుగు దేశాలు నేర్పిన గుణపాఠం అని భారదేశంలోని హిందూత్వ వాదులు అంటున్నారు. అత్యధిక శాతం హిందువులు ఉన్న ఏకైక దేశంగా భారత్ ఉన్నపుడు హిందూ దేశంగా ప్రకటించి హిందువులను పరిరక్షించుకునే చర్యలు ఇప్పటి నుంచే ఎందుకు చేపట్టకూడదు అని హిందూ సంస్థల నుంచి మెల్లగా డిమాండ్ బయల్దేరింది.కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉంది. ఆ పార్టీ నినాదం హిందూత్వనే. కానీ మూడవసారి సొంత మెజారిటీతో బీజేపీ అధికారంలోకి రాలేదు. జేడీయూ టీడీపీ మద్దతుతో అధికారం చలాయిస్తోంది. గత రెండు సార్లూ పూర్తి మెజారిటీ ఉండడంతో తాను అనుకున్న కొన్ని పనులను చేయగలిగింది. ఈసారి 400 ఎంపీ సీట్లు అన్న టార్గెట్ తో బరిలోకి దిగినా కూడా చివరికి దక్కింది 240 సీట్లు మాత్రమే.దీంతో బీజేపీ ఈ అయిదేళ్ళూ అధికారాన్ని కాపాడుకోవడం మీదనే దృష్టి పెట్టాలి తప్ప హిందూత్వ అంటూ సున్నిత అంశాల మీదకు వెళ్ళకూడదని అంటున్నారు. మరో వైపు చూస్తే సబ్ కా సాత్ సబ్ కా వికాస్ అని బీజేపీ ఎంత నినదించినా ఓట్లూ సీట్లు ఏ మాత్రం పెరగడం లేదని పైగా విపక్షాలు బలపడుతున్నాయని అంటున్నారు. దాంతో కాషాయ శిబిరంలో మధనం మొదలైంది. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో హిందూత్వ నినాదాన్ని ఎత్తుకోవాలని కూడా పార్టీలో చర్చ సాగుతోందని అంటున్నారు. అలా ఒక టెస్ట్ గా హిందూత్వను మళ్లీ పదును పెడితే అసెంబ్లీ ఎన్నికల్లో విజయం కనుక దక్కితే అపుడు భవిష్యత్తు కార్యాచరణను సిద్ధం చేయవచ్చు అని అంటున్నారు.పైగా ఇపుడు బంగ్లాదేశ్ పరిణామాల నేపథ్యంలో హిందూత్వ నినాదం ఎత్తుకుంటే రాజకీయంగా బలంగా ఉంటుందని కూడా యోచిస్తున్నారుట. ఏది ఏమైనా బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో ఉన్నపుడే హిందూ దేశంగా ప్రకటించేలా చేసుకోవాలని హిందూత్వ సంస్థలు ఆరాటపడుతున్నాయి. మరి దానికి రాజకీయ బలం ఎంతవరకూ సరిపోతుంది అన్నది కూడా చూడాల్సి ఉంది.

# బహ్రెయిన్‌లో ఇండియన్ ఎంబసీకి ఎమ్మెల్యే ఆది లేఖ



వేములవాడ: పాస్‌పోర్ట్ సమస్యల కారణంగా బహ్రెయిన్ జైల్లో చిక్కుకుపోయిన సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం చీర్లవంచ గ్రామానికి చెందిన మానువాడ నర్సయ్యను స్వదేశానికి రప్పించేందుకు కృషిచేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేంద్ర విదేశాంగ శాఖకు లేఖ రాసిన విషయం తెలిసిందే. తాజాగా ఇదే విషయమై వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ (ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్) భారత రాయబారి అధికారులకు లేఖ రాశారు. ఆయన క్షేమంగా స్వదేశానికి వచ్చేలా చూడాలని.28 ఏండ్ల క్రితం బతుకుదెరువు కోసం బహ్రెయిన్‌కు వెళ్లిన నర్సయ్య.. మూడేండ్ల పాటు తాపీ మేస్త్రీగా పనిచేశారని, అయితే వర్క్ పర్మిట్ ముగియడంతో అక్కడే ఉండిపోయానని చెప్పారు. దీంతో పాస్‌పోర్ట్, వీసా లేనందున బహ్రెయిన్‌లో గత కొన్నేండ్లుగా జైలు జీవితం అనుభవిస్తున్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే శ్రీనివాస్.. తక్షణమే స్పందించి ఆయనను దేశానికి రప్పించడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున బహ్రెయిన్‌లోని ఇండియన్ ఎంబిసి అధికారులతో మాట్లాడారు. నర్సయ్యను దేశానికి తీసుకెళ్లేందుకు అండగా ఉంటానని తెలిపారు.బతుకుదెరువు కోసం నర్సయ్య 1996లో బహ్రెయిన్ వెళ్లారు. అకడి 'ది అరబ్ ఇంజినీరింగ్ అండ్ కాంట్రాక్టింగ్ కంపెనీ'లో మూడేండ్లపాటు తాపీ మేస్త్రీగా పనిచేశారు. 1999 ఆగస్ట్‌లో వర్ పర్మిట్ ముగిసిన నర్సయ్య అక్కడే పనిచేస్తూ ఉన్నాడు.పాస్‌పోర్ట్ గడువు కూడా 2001లో ముగియడంతో బహ్రెయిన్‌లోని ఇండియన్ ఎంబాసీ రెన్యువల్ చేసింది. ఆ గడువు ముగిసిందని, అయితే నర్సయ్య తనవద్దనున్న పాస్‌పోర్ట్ పోకున్నాడు. వర్ పర్మిట్, పాస్‌పోర్ట్ లేకపోవటంతో అక్రమంగా తమ దేశంలో ఉంటున్నాడంటూ బహ్రెయిన్ పోలీసులు నర్సయ్యను అరెస్ట్ చేసి జైల్లో ఉంచారు. నర్సయ్యతో అతని భార్య లక్ష్మి, కూతుళ్లు సోన, అపర్ణ, కుమారుడు బాబు ఆందోళన చెందుతున్నారు.

# భారీ ఎత్తున పీసీసీ చీఫ్ ల మార్పు...



న్యూఢిల్లీ,దేశంలో దాదాపుగా ఎనిమిది నుంచి పది రాష్ట్రాలలో ప్రస్తుతం ఉన్న పీసీసీ చీఫ్ లను మార్చాలని కాంగ్రెస్ అధినాయకత్వం ఆలోచిస్తోంది. దీని కోసం ఈ నెల 13న ఢిల్లీలో జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కీలక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ అత్యున్నత స్థాయి పార్టీ సమావేశానికి దేశంలోని అన్ని రాష్ట్రాల పీసీసీ చీఫ్ లతో పాటు ఆయా రాష్ట్రాల ఇంచార్జిలు ఏఐసీసీ జనరల్ సెక్రటరీస్, సెక్రటరీస్ ఇతర ఉన్నత స్థాయి పార్టీ నేతలు హాజరవుతారు అని అంటున్నారు.ఈసారి జరిగేది కాంగ్రెస్ మెగా మీటింగ్ అని అంటున్నారు. అనేక కీలక నిర్ణయాలు ఈ సమావేశంలో తీసుకుంటారు అని అంటున్నారు. మరికొద్ది నెలలలో దేశంలో జార?ండ్ మహారాష్ట్ర, జమ్మూ అండ్ కాశ్మీర్, హర్యానా వంటి రాష్ట్రాలలో అసెంబ్లీ ఎన్నికలు ఉన్నాయి. అలాగే వచ్చే ఏడాది చివరిలో బీహార్ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి.అలాగే మరి కొన్ని రాష్ట్రాలలో పీసీసీ చీఫ్ లను మార్చాల్సి ఉంది. ఒడిషా తెలంగాణా వంటి చోట్ల కొత్త నాయకత్వాన్ని తెస్తారు. దాంతో ఈసారి మీటింగ్ లో సంచలన నిర్ణయాలు ఉంటాయని అంటున్నారు. దేశంలో మరింతగా బలం పుంజుకోవాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. అదే సమయంలో కాంగ్రెస్ ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికలలో సాధించిన సీట్లూ ఓట్ల పైన సమీక్ష చేయడం వంటివి చేస్తారు అని అంటున్నారు.ఈ సమావేశాలలోనే కాంగ్రెస్ ఏ రాష్ట్రాలలో ఎవరితో పొత్తులు పెట్టుకోవాలి అన్నది కూడా నిర్ణయిస్తారు అని అంటున్నారు. ఇప్పటికే ఇండియా కూటమి పక్షాలతో కాంగ్రెస్ కి పొత్తులు ఉన్నాయి. అలా లేని రాష్ట్రాలలో కాంగ్రెస్ అనుసరించే విధానం ఏమిటి అన్నది చూడాలి. ఉదాహరణకు ఏపీ విషయం కూడా చర్చకు రావచ్చు అని అంటున్నారు. ఏపీలో రానున్న అయిదేళ్లలో బలోపేతం కావడం పైన కూడా చర్చ సాగే అవకాశం ఉంది.ఇక ఏపీ పీసీసీ చీఫ్ గా ఈ జనవరిలోనే షర్మిలను నియమించారు. ఆమె నాయకత్వంలో పార్టీ ఎన్నికలకు వెళ్ళింది. ఆశించిన స్థాయిలో అయితే ఫలితాలు రాలేదు. వైఎస్సార్ కార్డు కూడా పెద్దగా పని చేయలేదు అని అంటున్నారు. అయితే వైసీపీని ఓడించడానికి మాత్రం కాంగ్రెస్ ఈ ఎన్నికలు ఉపయోగించుకుంది అని మరో మాట ఉంది.ఏపీలో టీడీపీ కూటమి అధికారంలో ఉంది. వైసీపీ ప్రతిపక్షంలో ఉంది. ఈ కొత్త రాజకీయ సన్నివేశంలో కాంగ్రెస్ ఏ విధంగా ఏపీలో భూమిక పోషించాలి అన్నది కూడా ఈ సమావేశాలలో కీలకమైన నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది అని అంటున్నారు.ఇక చూస్తే ఏపీలో కాంగ్రెస్ సీనియర్ లీడర్లు ఉన్నారు. వారిని షర్మిల కలుపుకుని పోవడం లేదని అంటున్నారు. దాంతో ఆమె తనదైన పంథాలో పార్టీని నడుపుతున్నారు. అయితే సీనియర్లు ఏ విధంగా అసంతృప్తి వ్యక్తం చేసినా షర్మిలకే హై కమాండ్ ఓటు వేస్తుందని అంటున్నారు. ఆమె పీసీసీ చీఫ్ గా ఉండడం ద్వారానే వైఎస్సార్ లెగసీని తమ వైపు తిప్పుకోవచ్చు అని వైసీపీని బలహీనం చేయవచ్చు అని ఒక వ్యూహం ఉంది అంటున్నారు.అయితే ఇండియా వైపు వైసీపీ చూస్తోంది అన్న వార్తల నేపథ్యంలో చూసినపుడు కాంగ్రెస్ తన వ్యూహాన్ని మార్చుకుంటుందా అన్నది కూడా చూడాల్సి ఉంది. ఏది ఏమైనా కాంగ్రెస్ మెగా మీట్ మీద ఏపీ కాంగ్రెస్ నేతలతో పాటు రాజకీయ పక్షాలు కూడా ఆసక్తిగా చూస్తున్నాయి. తెలంగాణా విషయం తీసుకుంటే కొత్త పీసీ చీఫ్ ని ఖరారు చేయడం ఖాయమని అంటున్నారు.

# మంత్రి సీతక్క సమక్షంలో కాంగ్రెస్ లో చేరికలు



ఆదిలాబాద్ : రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క ఇవాళ ఉదయం ఆదిలాబాద్ లోని కాంగ్రెస్ ప్రజాభవన్ లో స్థానిక కాంగ్రెస్ నేతలతో భేటీ అయి పార్టీ పరిస్థితులు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలువురు ఆదివాసీ నాయకులు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని మంత్రి సీతక్కకు అందజేశారు.ఆ తర్వాత బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు కార్యకర్తలు సీతక్క సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కంది శ్రీనివాస్ రెడ్డి, గిమ్మ సంతోష్, లోక ప్రవీణ్ రెడ్డి పాల్గొన్నారు.అనంతరం పార్టీ అసెంబ్లీ ఇంచార్జ్ కంది శ్రీనివాస్ రెడ్డితో కలిసి సీతక్క వరోర కేంద్రానికి బయలుదేరి వెళ్లారు. అక్కడ మహాత్మా గాంధీ స్థాపించిన సేవాగ్రాం ఆశ్రమాన్ని సందర్శించి కుష్టు వ్యాధి నివారణ కేంద్రాన్ని సందర్శించనున్నారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకల నేపథ్యంలో మహాత్మా గాంధీ స్థాపించిన సేవాగ్రాం చరఖా, ఖాదీ గ్రామోద్యోగ్ సంస్థ కార్యకలాపాలను మంత్రి పరిశీలించనున్నారు.

# సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటనపై బీఆరెస్ స్కానింగ్




హైదరాబాద్ : సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటనపై బీఆరెస్ పార్టీ స్కానింగ్ కొనసాగుతుంది. రేవంత్ రెడ్డి బృందం విదేశీ పర్యటనలో పెట్టుబడుల సాధనకు ఎక్కడెక్కడికి వెలుతున్నారు..ఎవరెవరిని కలుస్తున్నారు..ఏయే కంపనీలతో ఒప్పందాలు చేసుకుంటున్నారన్న వివరాలతో పాటు ఒప్పందాలు చేసుకుంటున్న కంపనీల చరిత్రను సైతం ఎప్పటికప్పుడు ఆరా తీస్తూ ప్రజలముందుంచుతుంది బీఆరెస్ సోషల్ మీడియా. అమెరికా పర్యటన ముగించుకుని దక్షిణ కొరియాలో అడుగుపట్టిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబులతో ఫినిక్స్ గ్రూప్ చైర్మన్ సురేశ్ చుక్కపల్లి భేటీ కావడంపై బీఆరెస్ పార్టీ ప్రశ్నల వర్షం కురిపించింది. గతంలో మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఫినిక్స్ కంపనీ సురేశ్ చుక్కపల్లి కల్వకుంట్ల కుటుంబానికి బినామీ అని..అతడిని జైల్లో వేయాలని..అతనిపై నేను పూర్తిగా ఈడీ, సీబీఐకి ఆధారాలిస్తానని చెప్పడం జరిగింది. ఆ వీడియోను సీఎం రేవంత్‌రెడ్డి కొరియా పర్యటనలో సురేశ్ చుక్కపల్లి కలిసి వున్న ఫోటోలతో జత చేస్తూ ఎక్స్‌లో పోస్టు చేసింది. సురేశ్ చుక్కపల్లి వ్యవహారంలో అప్పుడు అలా..ఇప్పుడు ఇలా కాంగ్రెస్ నేతలు వ్యవహరించడాన్ని బీఆరెస్ నిలదీసింది. ఇలాంటి ఫేక్ ప్రచారంతో అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచారంటూ విమర్శలు సంధించింది.గతంలో ఫీనిక్స్ సంస్థలో సోదాలు ఐటీ శాఖ సోదాలు సైతం నిర్వహించింది. బీఆరెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫీనిక్స్ చైర్మెన్ చుక్కపల్లి సురేష్ తో అత్యంత సన్నిహిత సంబంధాలు ఉన్నాయని, ఫీనిక్స్ సంస్థలో కేటీఆర్ భారీగా పెట్టుబడులు పెట్టారన్న ఆరోపణలు అప్పట్లో విపక్షాలు చేశాయి. ఫీనిక్స్ కు ప్రయోజనం కలిగేలా రూల్స్ కు విరుద్ధంగా ప్రభుత్వం పలు నిర్ణయాలు తీసుకుందనే ఆరోపణలు ఉన్నాయి. ఫీనిక్స్ గ్రూప్ దాదాపు లక్షా 50 వేల కోట్ల వ్యాపారం చేస్తుందని, హైదరాబాద్ నగరంలోని వందలాది ఎకరాల భూములను బీఆరెస్ ప్రభుత్వం ఫీనిక్స్ గ్రూప్ అప్పనంగా అప్పగించిందని విపక్షాలు ఆరోపించాయి.

# షేక్ హసీనా విషయంలో భారత్ సరైన పనే చేసింది



న్యూఢిల్లీ, పొరుగు దేశం బంగ్లాదేశ్‌లో హింసాత్మక నిరసనల నేపథ్యంలో షేక్ హసీనా (షేక్ హసీనా) ప్రధాన మంత్రి పదవికి రాజీనామా చేసి ఆ దేశాన్ని వీడిన విషయం తెలిసిందే.


ఈ కష్ట సమయంలో హసీనాకు భారత్ అండగా నిలిచి.. దేశంలో ఆశ్రయం కల్పిస్తోంది. ఈ నేపథ్యంలో హసీనాకు భారత్ ఆశ్రయం కల్పించడంపై కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ శశిథరూర్ (శశి థరూర్) తాజాగా స్పందించారు. ఈ మేరకు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.'షేక్ హసీనాకు సాయం చేయకపోయి ఉంటే అది భారతదేశానికి అవమానకరంగా ఉండేది. మనతో మనం చెడుగా ప్రవర్తిస్తే ఎవరూ మన స్నేహితులుగా ఉండాలని కోరుకోరు. హసీనా జీకి భారతదేశ నాయకులతో మంచి సంబంధాలు ఉన్నాయి. షేక్ హసీనా భారతదేశానికి స్నేహితురాలు. స్నేహితులు కష్టాల్లో ఉన్నప్పుడు ఎవరూ సహాయం చేయడానికి ముందు ఒకటికి రెండు సార్లు ఆలోచించరు. భారత ప్రభుత్వం కూడా ఈ సమయంలో హసీనాకు అండగా నిలిచింది. ఆమెను ఇక్కడికి తీసుకొచ్చి భద్రత కల్పించింది. భారత ప్రభుత్వం చేసిన పనిని నేను ఒక భారతీయుడిగా అభినందిస్తున్నాను. హసీనా విషయంలో భారత్ పనే చేసింది' అని థరూర్ సరైన చర్య.

# తుంగభద్రమే..నా?

హైదరాబాద్,కర్ణాటక రాష్ట్రంలోని హొస్పేట వద్ద ఉన్న తుంగభద్ర డ్యామ్ 33గేట్లలో 19వ నెంబర్ గేటు శనివారం రాత్రి కొట్టుకుపోయింది. గేట్లు మూసి వేస్తున్న ఈ ఘటన జరిగింది. గేటు చైన్‌కు ఉన్న లింక్ తెగి గేటు నీటి వత్తిడికి కొట్టుకుపోయింది. దీంతో మొత్తంగా ప్రాజెక్టు నుంచి లక్ష క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. నదిలో ఒక్కసారిగా వరద ప్రవాహం పెరగడంతో తెలుగు రాష్ట్రాల అధికారులు అప్రమత్తమయ్యారు. కర్నూలు %-% మహబూబ్‌నగర్ జిల్లాల్లోని నదీ పరివాహక ప్రాంతంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.తుంగభద్ర ప్రమాద ఘటనపై కర్ణాటక ప్రభుత్వం వెంటనే స్పందించింది. గేటు పునరుద్ధరణకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తోంది.ఆదివారం కర్ణాటక రాష్ట్ర ఉపముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ మాట్లాడుతూ తుంగభద్ర డ్యామ్ 19వగేటు ధ్వసం కావటం బాధాకారం అన్నారు. ఈ ప్రాజెక్టు కర్ణాటక ,తెలంగాణ ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వర ప్రదాయని అన్నారు. తుంగభద్ర డ్యామ్‌లో 40టి మిగిలిన భాగాల మేరకు నీటిని వుంచి నీటినంతా డ్యామ్ దిగువన నదిలోకి విడుదల చేస్తే గేటు రిపేర్లకు ఆస్కారం ఉంటుంది. చాలా వేగంగా గేటును పునరుద్ధరమన్నారు. ఈ ఏడాది ఈ ప్రాజెక్టు కింద ఖరీఫ్ పంటలకు మాత్రమే నీటిని అందించాలన్నారు. రబీ పంటలకు నీటిని అందించడం కొంచెం కష్టమే అని , ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు సహకరించాలని డి.కె శివకుమార్ విజ్ఞప్తి చేశారు.

పంటలకు నష్టం లేకుండా చూడండి:

తుంగభద్ర ప్రాజెక్టు పరిధిలోని ఆయకట్టులో పంటలకు నష్టం లేకుండా చూడాలని, తాత్కాలికంగా స్టాప్‌లాక్ గేటు ఏర్పాటు చేయడాన్ని టీబీ డ్యాం అధికారులతో మాట్లాడి తగిన సహకారం అందించాలని ఏపీ మంత్రి పయ్యావుల కేశవ్‌ను, ఆ రాష్ట్ర సీఎం చంద్రబాబు నిర్వహిస్తున్నారు. తుంగభద్ర గేటు కొట్టుకుపోవడంపై సీఎం చంద్రబాబు ఆరా తీశారు. జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, మంత్రి పయ్యావుల కేశవ్‌లతో మాట్లాడారు. తాత్కాలిక గేటు ఏర్పాటు చేయటంపై టీబీ డ్యాం అధికారులతో మాట్లాడి తగిన సహకారం అందించాలని మంత్రి పయ్యావుల కేశవ్‌ను సీఎం. తాత్కాలికంగా స్టాప్‌లాక్ గేటు ఏర్పాటు చేయడానికి ఇబ్బందులు ఉన్నాయి మంత్రి పయ్యావుల కేశవ్.టీబీ డ్యాం 1960లో నిర్మించిన పాత డిజైన్ కావడంవల్ల స్టాప్‌లాక్ గేట్ ఏర్పాటు చేయలేని పరిస్థితి నెలకొందని మంత్రి పయ్యావుల, చంద్రబాబుకు తెలిపారు. అలాగే నీటిపారుదలశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీతో సీఎం మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. తుంగభద్ర డ్యామ్ గేటు కొట్టుకుపోయిన వెంటనే రాష్ట్రంలోని అప్రమత్తం ఉందని మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. డ్యామ్ అధికారులతోనూ మాట్లాడినట్లు చెప్పారు. తెల్లవారుజామున గేటు కొట్టుకుపోవడం, ప్రాజెక్టు నుంచి పెద్ద ఎత్తున నీరు వృథాగా పోతుందన్నారు. అనంతపురం, కర్నూలు జిల్లాలకు తుంగభద్ర డ్యామ్ గుండెకాయలాంటిదన్నారు. దీని నమ్ముకుని లక్షలాదిమంది రైతులు పంటలు వేశారని, నీరు వృథాగా పోకుండా అధికారులు వెంటనే



చర్యలు తీసుకోవాలన్నారు.

గేటు ఇప్పటికిప్పుడు సాధ్యం కాదు :మంత్రి శివరాజ్

తుంగభద్ర ఆనకట్ట 19వ క్రస్ట్ గేట్ చైన్‌లింక్ తెగిపోవడంపై కర్ణాటక రాష్ట్రం, కొప్పాల జిల్లా ఇన్‌చార్జి మంత్రి శివరాజ్ మీడియాతో మాట్లాడారు. గేటు ద్వారా 35 వేల క్యూసెక్కుల నీరు విడుదలవుతోందని కలిగి ఉంది. గేటు మరమ్మతు ఇప్పటికిప్పుడు సాధ్యం కాదని చెప్పారు. జలాశయంలోని 65 టీఎంసీల నీటిని విడుదల చేయాలన్నారు. దాదాపు 65 టీఎంసీల నీటిని ఖాళీ చేయడం తప్ప రిజర్వాయర్‌కు ప్రత్యామ్నాయం కనిపించడం లేదని భద్రత ఉంది. ప్రస్తుతం అన్ని గేట్ల నుంచి లక్ష క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని తెలిపారు. 20 అడుగుల నీరు ఖాళీ అయితే తప్ప గేటు పరిస్థితి ఏమిటో చెప్పలేమన్నారు.

తుంగభద్రకు ఎగువ నుంచి తగ్గిన వరద :

తుంగభద్ర ప్రాజెక్టులోకి ఎగువ నుంచి వరద ప్రవాహం ఆదివారం సాయంత్రానికి తగ్గుముఖం పట్టింది. ప్రాజెక్టుల్లో నీటిమట్టం 1632 అడుగుల వద్ద నీటినిల్వ 104టికిలకు చేరింది.ఎగువ నుంచి 36739క్యూసెక్కుల నీరు చేరుతుండగా, ప్రాజెక్టు నుంచి దిగువకు 55327 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

శ్రీశైలంకు 2.18లక్షల క్యూసెక్కులు:

ఎగువన కర్ణాటకలో వర్షాలు తగ్గుముఖం పట్టాయి.దీంతో కృష్ణా నదిలో వరద కూడా స్వల్పంగా తగ్గింది. అల్మట్టి ప్రాజెక్టులోకి 56వేల క్యూసెక్కుల వరద నీరు చేరుతండగా , ప్రాజెక్టు నుంచి 15వేల క్యూసెక్కుల నీరు బయటకు వస్తోంది. జూరాలకు 85000క్యూసెక్కుల నీరు చేరుతుండగా ,ప్రాజెక్టు నుంచి 82339క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సుంకేసుల వద్ద తుంగభద్ర నదిలో లక్ష క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగుతోంది. ఇటు తుంగభద్ర అటు కృష్ణా నదుల ద్వారా శ్రీశైలం ప్రాజెక్టులోకి 2.18లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం చేరుతుండగా ప్రాజెక్టు నుంచి 2.84లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి 1.86లక్షల క్యూసెక్కుల నీరు చేరుతుండగా, ప్రాజెక్టు నుంచి 1.04లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

## వ్యవసాయాన్ని పరిశ్రమగా అభివృద్ధి చేయాలి

న్యూఢిల్లీ,రైతులని కాపాడుకుని, వ్యవసాయాన్ని పండగ చేస్తామంటున్న ప్రభుత్వాలు ఆ దిశగా అడుగులు వేయాలి. చిత్తశుద్దితో పనిచేసే వ్యవస్థను రూపొందించాలి. రైతులను ఓటు బ్యాంకుగా చూడకుండా మనకు పట్టెడు అన్నం పెట్టే తల్లిగా చూసుకోవాలని సూచించారు. రైతుల సమస్యలను పట్టించుకునే దిశగా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు కీలక నిర్ణయాలు తీసుకోవాలి. ఏటా ఒక విధానంగా గాకుండా, రుణమాఫీలు అవసరం లేని విధంగా రైతులు స్వయం సమృద్ధిగా ఎదిగేలా చేయాలి. సస్య విప్లవానికి నాంది పలకాలి. మన అవసరాలకు సరిపడా కందులు, మిరప, ఇతర పంటలను రైతులు చెమటోడ్చి పండించినా వాటిని కొనుగోలు చేయడం లేదు. రైతుల సమస్యలు రాజకీయ పక్షాలకు ప్రచార కార్యక్రమం గానే మిగిలిపోయాయి. పాలకపక్షం అయినా, ప్రతిపక్షం అయినా రైతుల సమస్యలను పరిష్కరించడానికి చిత్తశుద్ధితో ఆలోచించడం లేదు. వ్యవసాయరంగంలో విప్లవాత్మకనిర్ణయాలు తీసుకోవాల్సిన సమయం వచ్చింది. పంటల ఎగుమతులు లక్ష్యంగా వ్యవసాయం మారాలి. సేంద్రియం వైపు సాగు మళ్లకుంటే ప్రజలు మరింతగా అనారోగ్యం పాలు కాగలరని నిపుణులు హెచ్చరిస్తున్నారు. బహుళ జాతి కంపెనీలకు ఎర్ర తివాచీలు పరుస్తున్న ప్రభుత్వాలు రైతులను అనుత్పాదక రంగాలుగా చూస్తున్న తీరు మారాల్సి ఉంది. స్వాతంత్ర్యం లభించి 76సంవత్సరాలు పూర్తయినా ఈ ఆధునిక ఆర్థిక వ్యవస్థలో రైతుల సమస్యలు మరింత జటిలం అవుతున్నాయే తప్ప పరిష్కారం కావడం లేదు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టమైన వ్యవసాయిక విధానం లేకపోవడం రైతుల పాలిట శాపంగా మారింది. ఫ్రీ మార్కెట్ అనేది ఒక అభూత కల్పన మాత్రమే అయ్యింది. దేశ ఆర్థిక వ్యవస్థ 8నుంచి 9శాతం వరకూ వృద్ధి జరుగుతున్నప్పటికీ, వ్యవసాయ ఉత్పత్తులు పెరుగుతున్నా రైతుల ఆర్థిక వ్యవస్థ మాత్రం బాగుపడటం లేదు. అవసరం లేకున్నా ఇబ్బడిముబ్బడిగా ఆహారధాన్యాలను దిగుమతి చేసుకోవడం కూడా రైతులకు శాపంగా మారింది. కల్తీలు కూడా రైతును కాటేస్తున్నాయి. పంటల విధానంలో శాస్త్రీయ దృక్పథం లోపించడం, సేంద్రియ ఎరువుల బదులు రసాయన ఎరువులు వాడడం వల్ల భూమిసారం తగ్గుతోంది. ఏ పంటపండించినా గిట్టుబాటు ధరలు లభించడం లేదు. మసరైతులనే ప్రోత్సహించి పంటల దిగుబడి పెంచుకోవాలి. పెరిగిన ఉత్పత్తులను ఎగుమతి చేసుకునేలా విధానాలు రూపొందించాలి. రైతులను కాపాడుకునేలా రైతాంగ విధానాలు వస్తే తప్ప వారు బలికి బట్ట కట్టేలా లేరు. కరువులు వచ్చినా, వర్షాలు కురిసినా రైతుల దుర్భర పరిస్థితులలో ఎలాంటి మార్పూ కనిపించడం లేదు. మరోవైపు ప్రతి సంవత్సరం వేలాది మంది రైతులు పట్టణాలకు వలస వెళ్లి దినసరి కూలీలుగా మారుతున్నారు. చిన్నాచితక వ్యాపారాలతో పొట్టపోసుకుంటున్నారు. వ్యవసాయ భూమి లేని కూలీలు కౌలుకు తీసుకొని నష్టాలపాలయి బ్రతుకునీడ్చలేక, అవమానం భరించలేక, చివరికి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.గిట్టుబాటు ధరలు లేక వచ్చిన ఆదాయం కూలీల ఖర్చుకే సరిపోతుంది. ప్రతి ఎకరాకు కౌలు 10 వేల నుంచి 25 వేల రూపాయల వరకు భూమి యజమానులకు చెల్లించవలసి వస్తుంది. లక్షలాది మంది రైతులు వర్షాలు కురిసి కాలం మంచిగా అయినప్పటికీ ధరలు రాక నష్టపోతు న్నారు. వర్షాలు లేని సంవత్సరాలలో పంటలు ఎండిపోయి నష్ట పోతున్నారు. కాలం అయినా గాని, కరువు అయినా గాని రైతుకు మిగిలేది అప్పులే. మార్కెట్లో రైతుకు దోచుకునే వ్యాపారస్తులు నిరాటంకంగా విజృంభిస్తున్నారు. వ్యవసాయ ఉత్పత్తి వ్యయాలు అనేక రెట్లు పెరిగిపోవడంతో పాటు విత్తనాల దగ్గర నుంచి నకిలీలు రైతులను కుంగదీస్తున్నాయి. చాలామంది రైతులు, కౌలుదారులు బ్యాంకు రుణాలు పొందలేక పోతున్నారు, వడ్డీ వ్యాపారస్థుల దగ్గర అప్పు తీసుకుంటే తడిసి మోపెడవుతుంది. ఈ సమస్యలను అధిగమించి రైతుకు అండగా ఉండాల్సిన ప్రభుత్వాలు రుణామాఫీ ప్రకటించి మొక్కుబడి తీర్చుకుంటు న్నారు. సేంద్రియ వ్యవసాయానికి ప్రోత్సాహకాలు పెంచాలి.


## ఆశ్రమ పాఠశాలలకు సన్నబియ్యం

నిజామాబాద్,రాష్ట్ర ప్రభుత్వం ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందించడంలో భాగంగా సన్నబియ్యం సరఫరా చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఈ బియ్యం దారిమళ్లుతున్నట్టు అధికారులు గుర్తించారు. దీంతో పౌరసరఫరాల శాఖ సన్నబియ్యం వినియోగంలో అక్రమాలను అరికట్టేందుకు నూతన విధానాన్ని అమల్లోకి తెచ్చింది. ఆయా ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు లేదా,వార్డెన్, డిప్యూటీ వార్డెన్లు బియ్యం సరఫరా అవుతున్న ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద వేలిముద్ర వేస్తేనే సన్నబియ్యం విడుదలయ్యేలా నేషనల్ ఇన్‌ఫర్మేటిక్ సెంటర్ వెబ్‌సైట్ అభివృద్ధి చేసింది. వేలాదిమంది విద్యార్థులు ఈ విద్యాసంవత్సరం ఆశ్రమ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్నారు. వారి వివరాలు సంబంధిత ఉపాధ్యాయులు వెబ్‌సైట్‌లో నమోదు చేసుకున్నారు. ఆగస్టు నుంచి నూతన విధానం సైతం అమలులోకి వచ్చినట్లు ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే కొన్ని ఆశ్రమ పాఠశాలలు ఆన్‌లైన్ విధానం ద్వారా సన్నబియ్యం తీసుకెళ్తున్నారు. జిల్లాలో ఆశ్రమ పాఠశాలలు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుంటేనే సన్నబియ్యం అందుతాయి. ఇప్పటికే రేషన్ దుకాణాల్లో ఈ-పాస్ యంత్రాలను ఉపయోగించి కార్డుదారుల వేలిముద్రలు వేసిన తర్వాతే బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఇదే విధానాన్ని ఆశ్రమ పాఠశాలలకు వర్తింపజేస్తున్నారు. ఆయా ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు లేదా వార్డెన్, డిప్యూటీ వార్డెన్లు వారి వేలిముద్రలను ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద పెడితేనే బియ్యం సరఫరా చేయనున్నారు. నెలలో ఎంతబియ్యం పాఠశాలకు కేటాయించాలనేది ఆన్‌లైన్‌లోనే లెక్క తేలుతుంది. అటోమెటిక్‌గా ఆ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, నిల్వ ఉన్న బియ్యం ఆధారంగా మరుసటి నెలకు కావాల్సిన బియ్యం కేటాయింపులు ఖరారు అవుతుంది. ఆశ్రమ పాఠశాలలకు అక్కడి విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సన్నబియ్యం కేటాయిస్తారు.

## యూ ట్యూబ్ మాజీ సిఇవో సుసాన్ మృతి

క్యాలిఫోర్నియా,యూట్యూబ్ మాజీ సీఈవో సుసాన్ వోజ్‌కికీ కన్నుమూశారు. ప్రస్తుతం ఆమె వయసు 56 ఏళ్లు. సుసాన్ మరణవార్తను ఆమె భర్త డెన్నిస్ ట్రోపర్ సోషల్ మీడియా ద్వారా ధృవీకరించారు. ఈ మేరకు భావోద్వేగ పోస్ట్ పెట్టారు. రెండేళ్లుగా ఊపిరితిత్తుల క్యాన్సర్ తో పోరాడుతున్నట్లు చెప్పారు. ఇవాళ కుటుంబాన్ని వదిలేసి తిరిగిరాని లోకానికి వెళ్లిపోయిందంటూ భావోద్వేగానికి గురయ్యారు. యూఎస్‌కు చెందిన సుసాన్ 2014 నుండి 2023 వరకు యూట్యూబ్ సీఈవోగా పనిచేసిన విషయం తెలిసిందే. అంతకు ముందు ఆమె గూగుల్‌లో పనిచేశారు. ఈ నేపథ్యంలో సుసాన్ మృతిపై గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రెండు సంవత్సరాలు క్యాన్సర్‌తో పోరాడిన తన స్నేహితురాలు మరణించడం నమ్మశక్యంగా లేదని పేర్కొన్నారు. తను ఓ అద్భుతమైన వ్యక్తి అని, ఆమె లేని ప్రపంచాన్ని ఊహించడం కష్టమన్నారు. కాగా, గూగుల్‌లో సుసాన్ కీలక వ్యక్తిగా వ్యవహరించారు. ఇంటర్నెట్‌ను రూపొందించడంలో ముఖ్యపాత్ర పోషించారు.

## జీహెచ్‌ఎంసీ చేపడుతున్న జీఐఎస్ సర్వే మతలబు ఇదే





హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆస్తుల నుంచి వాటి కొలతల ప్రకారం పూర్తి పన్ను వసూలుకు రంగం సిద్ధమవుతున్నది. ఇప్పటివరకు తమ ఆస్తులను సెల్ఫ్ అసెస్‌మెంట్ (స్వీయ మదింపు) చేసుకొని పన్ను చెల్లిస్తున్న ఇండ్ల యజమానులు ఇకపై జీహెచ్‌ఎంసీ నిర్ణయించే మొత్తాన్ని చెల్లించాల్సి వస్తుంది. ఇందుకోసం నగరంలో జీఐఎస్ (జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం) సర్వే చేపట్టినట్టు తెలుస్తున్నది. ఇది కార్యరూపం దాలిస్తే హైదరాబాద్ మహానగరవాసులు అదనంగా మరో రూ.3000 కోట్లు చెల్లించాల్సి వస్తుంది. ఆస్తి పన్ను పెంపుదల ఉండదని హైదరాబాద్‌ను దేశంలో రోల్‌మాడల్‌గా నిలిపేందుకే ఈ సర్వే జరుపుతున్నామని అధికారులు చెప్తున్నప్పటికీ, దాని మర్మం ఆస్తి పన్నుల వసూళ్లను పెంచడమేనని సమాచారం. ప్రస్తుతం గ్రేటర్ వ్యాప్తంగా ఆస్తి పన్ను వసూళ్లు ఏడాదికి రూ.1900 కోట్ల వరకు ఉండగాదానిని రూ.5వేల కోట్లకు చేర్చాలనేది ఈ జీఐఎస్ సర్వే ప్రధాన లక్ష్యం. వాస్తవానికి గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే ఈ సర్వే ప్రతిపాదన ఒక ప్రైవేటు ఏజెన్సీ ద్వారా ప్రభుత్వం దృష్టికి వచ్చింది. కానీ పేద, మధ్య తరగతి ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం పడుతుందని భావించిన కేసీఆర్ సర్వే ప్రతిపాదనను తిరస్కరించారు. అదే ప్రతిపాదన ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో మళ్లీ మొగ్గ తొడిగింది. అణువణువూ అన్వేషించివన్నుల వెూతను వెూగించేందుకు సిద్ధమవుతున్నది.**ప్రస్తుతం స్వీయ మదింపుతోనే చెల్లింపులు:** జీహెచ్‌ఎంసీ పరిధిలో ప్రస్తుతం 19 లక్షలకు పైగా ఉన్న ఆస్తుల నుంచి ఏటా రూ.1900 కోట్ల వరకు ఆస్తి పన్ను రూపంలో జీహెచ్‌ఎంసీ ఖజానాకు చేరుతున్నది. ఎన్నో ఏండ్ల కిందట నిర్ధారించిన ఆస్తి పన్నును ప్రామాణికంగా చేసుకొని యజమానులు చెల్లింపులు జరుపుతున్నారు. అనుమతులు లేని నిర్మాణదారులు రెట్టింపు స్థాయిలో ఆస్తి పన్ను కడుతున్నారు. వీరంతా స్వీయ మదింపు (సెల్ఫ్ అసెస్‌మెంట్) విధానంలోనే ఆస్తి పన్ను చెల్లిస్తున్నారు. వీరు తమ ఆస్తిని భారీగా కాకున్నా కొంతమేర తక్కువగా అంచనా వేసి చెల్లింపులు చేస్తున్న వారి సంఖ్య గణనీయంగా ఉంటుంది. వీరిలో పేద, మధ్య తరగతి కుటుంబాలు అధికంగా ఉంటాయి. ఈ నేపథ్యంలో జీఐఎస్ సర్వే ద్వారా ప్రతి ఆస్తిని అణువణువూ లెక్కించవచ్చని ఒక ప్రైవేటు ఏజెన్సీ ప్రతిపాదించినట్టు తెలిసింది. జీఐఎస్ సర్వేలో డ్రోన్ ద్వారా ప్రతి ఆస్తి కొలత పక్కాగా తేలుతుంది. గూగుల్ స్ట్రీట్ మ్యాప్ ద్వారా అది ఎన్ని అంతస్థుల భవనమో నిర్ధారణ అవుతుంది. ఇలా ప్రతి అంగుళం కూడా లెక్కించి అది నివాస ప్రాంతమా? లేక వాణిజ్య ప్రాంతమా? అనే ప్రామాణికతతో ఆస్తి పన్నును సవరించనున్నారు. అంటే ప్రస్తుతం చెల్లిస్తున్న దానికంటే ఇకపై భారీ మొత్తమే చెల్లించాల్సి వస్తుంది. తద్వారా జీహెచ్‌ఎంసీకి కాసుల వర్షం కురుస్తుందనేది సదరు ఏజెన్సీ వాదన. **ఉన్నపళంగా ఆర్థిక భారం మోపొద్దనే:**జీఐఎస్ సర్వే ప్రతిపాదనను గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే ప్రైవేటు ఏజెన్సీ తెరపైకి తెచ్చింది. దీని ద్వారా జీహెచ్‌ఎంసీ ఆదాయం భారీగా పెరుగుతున్నది వాస్తవమే. కానీ ఆ పెరుగుదల పేద, మధ్యతరగతి భారాన్ని మోపుతుంది. ప్రస్తుతం ఆస్తుల మదింపు అణువణువూ కొలతల ఆధారంగా జరగలేదు. కాస్త అటుఇటూ ఉంటుందనేది బహిరంగ రహస్యం. ఇప్పుడు జీఐఎస్ సర్వే చేపట్టడమంటే చెల్లింపుదారుల నుంచి ముక్కుపిండి వాస్తవ మొత్తాన్ని వసూలు చేస్తారు. ఇండ్లకు సంబంధించిన ఆస్తిపన్ను చెల్లింపుదారుల్లో పేద, మధ్య తరగతి కుటుంబాలే అధికంగా ఉన్నాయి. వాణిజ్య సముదాయాలను మినహాయిస్తే కాలనీల్లో ఉండే చిన్నచిన్న వ్యాపారదారులు కూడా మధ్య తరగతి కుటుంబాల పరిధిలోకే వస్తారు. నిర్మాణాల వాస్తవ కొలతల ఆధారంగా పేద, మధ్య తరగతి ప్రజల నుంచి ముక్కుపిండి ఆస్తి పన్ను వసూలు చేయాల్సి రావడాన్ని కేసీఆర్ ప్రభుత్వం వ్యతిరేకించింది. వారి జేబుల నుంచి వచ్చే సొమ్ముతో జీహెచ్‌ఎంసీ ఆదాయాన్ని పెంచుకోవాలనే లక్ష్యాన్ని కేసీఆర్ తిరస్కరించారు. దీంతో ఆ ప్రతిపాదన అప్పట్లో అటకెక్కింది.**ఇంటి డాక్యుమెంట్లు అడుగుతున్న సర్వే సిబ్బంది:** మరోవైపు ఒక ప్రైవేటు ఏజెన్సీ ద్వారా జరుగుతున్న ఈ సర్వేలో.. యజమానుల నుంచి ఆధార్ కార్డు, ఇంటి డాక్యుమెంట్లు అన్నీ సేకరిస్తున్నారు. దీనిపై నగరవాసుల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికే జీహెచ్‌ఎంసీ దగ్గర యజమానులకు సంబంధించిన సమగ్ర వివరాలు కంప్యూటరీకరించి ఉన్నందున ప్రైవేటు ఏజెన్సీకి ఇవ్వాల్సిన అవసరమేముందని వారు ప్రశ్నిస్తున్నారు. అసలే సైబర్ క్రైం నిత్యం ఓ పెను సవాల్‌గా మారిన ఇలాంటి తరుణంలో ప్రజల వ్యక్తిగత డాటా బయటికి పోవడంపై ఆందోళన వ్యక్తమవుతున్నది. సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నపుడు ప్రైవేటు ఏజెన్సీలకు వ్యక్తిగత వివరాలు వెళ్లడంపై ఆందోళన వ్యక్తం చేసిన దాఖలాలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం జీఐఎస్ సర్వే దరిమిలా ప్రైవేటు ఏజెన్సీ డాక్యుమెంట్లను తీసుకోవడాన్ని పలువురు వ్యతిరేకిస్తున్నారు. **కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే..:** కాంగ్రెస్ అధికారంలోకి రాగానే జీఐఎస్ సర్వే మళ్లీ తెరపైకి వచ్చింది. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సర్వే ప్రతిపాదనకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ప్రస్తుతమున్న ఆదాయానికి అదనంగా మరో రూ.3వేల కోట్లు వస్తాయనే లక్ష్యంతో ఈ సర్వేకు అనుమతి ఇచ్చినట్టు తెలుస్తున్నది. కానీ పైకి అధికారులు మాత్రం గ్రేటర్ ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి, పట్టణ ప్రణాళిక, వనరుల నిర్వహణను మెరుగుపరిచేందుకు జీఐఎస్ సర్వే ఎంతగానో దోహద పడుతుందని చెప్తున్నారు. కానీ సర్వే అనంతరం యజమానులకు సాంకేతికంగా కొలతలు చూపి.. గతంలో తక్కువ పరిమాణం ప్రాతిపదికన తక్కువ మొత్తం చెల్లిస్తున్నారని, వాస్తవ కొలతల ఆధారంగా ఇంత మొత్తం నిర్ధారణ అయిందని నోటీసులు ఇవ్వనున్నట్టు తెలిసింది. సాంకేతిక సర్వే అయినందున యజమానులకు దానిని తప్పుబట్టే అవకాశం కూడా ఉండదు.

## కార్గో సర్వీసుల్లో రాఖీల డోర్ డెలివరీ

హైదరాబాద్,ఈ నెల 19వ తేదీన రాఖీ పండుగ నేపథ్యంలో టీజీఎస్ ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. రాఖీ పండుగకు నాలుగైదు రోజుల ముందు నుంచి కార్గో సెంటర్లలో ప్రత్యేక కౌంటర్లు తెరిచేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.దూర ప్రాంతాల్లో ఉన్న తమ సోదరులకు సోదరీమణులు రాఖీలు పంపేందుకు వీలుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆర్టీసీ అధికారులు పేర్కొన్నారు. రాఖీలతో పాటు స్వీట్ బాక్సులు, బహుమతులు, ఇతర సామగ్రిని కూడా పంపే అవకాశం కల్పించారు. తెలంగాణలోని వివిధ ప్రాంతాలతో పాటు పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక తదితర రాష్ట్రాలకు రాఖీలను పంపించుకోవచ్చని పేర్కొన్నారు.ఇందుకోసం అన్ని బస్టాండ్లలోని కార్గో సెంటర్లలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్గో సెంటర్లలో బుక్ చేసిన 24 గంటల్లోనే రాఖీలను డెలివరీ చేసే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు. కార్గో అధికారులు కౌంటర్లు తెరవడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ, రాఖీల రవాణా ధర ఇంకా ఖరారు కాకపోవడంతో ఉన్నతాధికారుల అనుమతి కోసం వేచి ఉన్నారు. రాఖీల రవాణకు సంబంధించిన ధరల విషయంలో సోమవారం స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## అనుచిత పోస్టులు...

హైదరాబాద్,అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత పోస్టులు పెట్టిన నిందితుడిని సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వాఖ్యలు చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు చేశాడు. తాజాగా జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడిన వీడియోలను సేకరించి స్పీకర్‌పై అనుచిత వాఖ్యలు చేసి, కించపరిచే విధంగా పోస్టులు చేసి సోషల్ మీడియాలో వైరల్ చేశాడు.ఈ విషయంపై గతంలో హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులకు అసెంబ్లీ కార్యదర్శి ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. వికారాబాద్ మోమిన్‌పేటకు చెందిన విజయ్ కుమార్ అనే వ్యక్తిని ఈ కేసులో అరెస్ట్ చేశారు. హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. విజయ్ కుమార్ ఎవరు చెబితే ఈ పోస్టులను వైరల్ చేశారన్న అంశంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో మరికొంత మందిని పోలీసులు అరెస్ట్ చేసే అవకాశాలు ఉన్నాయి.

## గ్రామ పాలనను గాలికొదిలేసిన రేవంత్

హైదరాబాద్,హైదరాబాద్: రేవంత్ ప్రభుత్వం గ్రామ పరిపాలన గాలికొదిలేసి, ఆకాశంలో మేడలు కడుతోందని సిర్పూర్ కాగజ్‌నగర్ బీజేపీ శాసన సభ్యులు పాల్వాయి హరీష్‌బాబు ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనకు వెళ్లారా, ఇంకేమైనా చక్కబెట్టడానికి పోయారనేది తెలియదని ఆరోపించారు. శనివారం నాడు బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీష్ బాబు మాట్లాడుతూ... రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలంగాణ ప్రజలు గుణపాఠం చెప్పాలని హెచ్చరించారు. కొడంగల్, వికారాబాద్, నారాయణపేట్‌కు మాత్రమే ముఖ్యమంత్రి పరిమితమయ్యారని ఎద్దేవా చేశారు. విద్యా వలంటీర్లను కొడంగల్‌కు మాత్రమే పరిమితం చేస్తున్నారని విమర్శలు చేశారు. రేవంత్ రెడ్డి కొడంగల్‌కు మాత్రమే ముఖ్యమంత్రి కాదని, రాష్ట్రానికి ముఖ్యమంత్రి అని గుర్తించుకోవాలని పాల్వాయి హరీష్‌బాబు హితవు పలికారు.ప్రపంచ ఆదివాసీల కార్యక్రమాలను నిన్ననే ప్రభుత్వం ఊరూర జరుపుకుంది, కానీ వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని చెప్పారు. ఆదివాసీల గ్రామాలకు నేటికీ రహదారులు లేవని అన్నారు. కొమురం భీం జిల్లాలో గిరిజన మహిళ డెలివరీ కోసం, పురిటి నొప్పులతో రెండు కిలోమీటర్లు నడవాల్సి వచ్చిందని పాల్వాయి హరీష్‌బాబు ఆందోళన వ్యక్తం చేశారు. వాగు దాటగానే దారి మధ్యలోనే డెలివరి అవడంతో పుట్టిన బిడ్డ చనిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో గిరిజన బతుకులు దయనీయమైన పరిస్థితుల్లో ఉన్నాయని వివరించారు. గిరిజన గ్రామాలకు రహదారులు లేక ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితులు ఉన్నాయని చెప్పారు. ఆరోగ్య సమస్యలు వస్తే ఆస్పత్రికి వెళ్లటానికి కిలోమీటర్ల మేర నడవాల్సిన పరిస్థితులు రాష్ట్రంలో నెలకొన్నాయని పాల్వాయి హరీష్‌బాబు అన్నారు.గిరిజన బతుకులు ఇలా ఉంటే మంత్రి సీతక్క మాత్రం గిరిజన గ్రామాలకు నాలుగేళ్లలో తారు రోడ్లు వేస్తామని చెబుతున్నారని ఇది త్వరగా సాధ్యం కావాలని కోరుకున్నారు. పల్లెల్లో పాలన పూర్తిగా పడకేసిందని చెప్పారు. పంచాయతీల్లో సర్పంచులు లేరు, పంచాయతీలన్ని గ్రామ కార్యదర్శులకు అప్పజెప్పారని పాల్వాయి హరీష్‌బాబు విమర్శలు చేశారు. తొమ్మిది నెలల్లో పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క గ్రామాలకు ఒక్క రూపాయి నిధులను ఎందుకు కేటాయించలేదని ప్రశ్నించారు.సీతక్క మీద చాలా నమ్మకం ఉండేదని, కానీ గ్రామాల్లో పరిస్థితులు చూస్తుంటే సీతక్కపై ఆ నమ్మకం కోల్పోయేలా ఉందని అన్నారు. ప్రభుత్వం గ్రామ పరిపాలన గాలికొదిలేసి, ఆకాశంలో మేడలు కడుతోందని విమర్శించారు. రాష్ట్రం, రాష్ట్ర ప్రభుత్వం ఎటు పోతుందో తెలియడం లేదని పాల్వాయి హరీష్ బాబు ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ మంత్రులంతా సంపాదించుకునే పనిలో బిజీగా ఉన్నారని ఆరోపించారు. గ్రామ పంచాయతీలు నిర్వీర్యం చేశారని పాల్వాయి హరీష్‌బాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## దొరికిపోయారా ?

అమరావతి,కేంద్రంలోని బీజేపీలో ఎంతో మంది నాయకులు ఉంటారు. నిరంతరం బీజేపీలో మేధో మధనం జరుగుతుంది. దాని మాతృ సంస్థ అయిన ఆరెస్సెస్ అయితే పూర్తి స్థాయిలో దిశా నిర్దేశం చేస్తూ ఉంటుంది. ఆరెస్సెస్ లో ఉన్న వారు అంతా తెలివి నిండిన వారు తలలు పడిన వారు. వారు అనేక సబ్జెక్టులలో నిపుణులు. బీజేపీ వంటి రాజకీయ ముఖాన్ని జనంలో ఉంచి రాజకీయంగా సరైన ట్రాక్ లో పెడుతున్న ఆరెస్సెస్ మేధస్సుని తక్కువ అంచనా వేయడం ఎవరి తరమూ కాదు.బీజేపీ నేతలు జనంలో ఉన్నా లేకపోయినా ఆరెస్సెస్ క్యాడర్ క్షేత్ర స్థాయిలో ఎపుడూ ఉంటుంది. అలా ఫీడ్ బ్యాక్ ని తెచ్చి ఎప్పటికప్పుడు బీజేపీకి ఇస్తుంది. అది డిస్కషన్ పెడుతూంటుంది. అలా బీజేపీకి కోట్లాది మంది జనాలు ఏమి అనుకుంటున్నారు అన్నది తెలుస్తూ ఉంటుంది. అంతే కాదు వివిధ రాష్ట్రాలలో రాజకీయ సామాజిక ఆర్థిక పరిస్థితుల మీద ఆరెస్సెస్ అధ్యయనాలు ఉంటాయి.ఇంకో విషయం ఏంటి అంటే ఉచితాలకు ఆరెస్సెస్ బహు దూరం. అదే బీజేపీ ఫిలాసఫీ గా మారింది. ఏపీలో చూస్తే సూపర్ సిక్స్ అంటూ చంద్రబాబు ఎన్నికల వేల అనేక హామీలను ఇచ్చేశారు. ఎడా పెడా ఆయన వాటిని జనంలో ప్రచారం చేసేశారు. బాబు ధైర్యం ఏమిటి అంటే కేంద్రంలో బీజేపీ అండ ఉంటుందని. నిజానికి ఏపీ ఆర్థిక పరిస్థితి బాబుకు తెలియంది కాదు అని అంటారు.అయితే కేంద్రం మద్దతు ఉంటే తాను హామీలను నెరవేర్చగలను అని ఆయన భావించారు. కానీ కూటమి మేనిఫేస్టోకి బీజేపీ ప్రతినిధులు హాజరైనా ఆ మేనిఫేస్టోని ముట్టుకోలేదు. దాంతోనే టీడీపీకి షాక్ కొట్టినట్లు అయింది. ఉచిత హామీలు తమవి కావు తమ నెత్తిన అవి ఎప్పటికి భారం కాకూడదు అని ముందు చూపుతోనే బీజేపీ ఇలా చేసింది అని నాడే అంతా అనుకున్నారు.అదే ఇపుడు ఆచరణలో జరుగుతోంది. బీజేపీ పొత్తులో టీడీపీ ఏ మేరకు లాభపడింది అన్నది పక్కన పెడితే ప్రభుత్వ పరంగా మాత్రం ఆర్థిక సాయం అనుకున్న స్థాయిలో దక్కడం లేదు అని అంటున్నారు. తెలుగుదేశం హామీలు ఆ పార్టీ ఇష్టం అన్నట్లుగానే బీజేపీ వ్యవహరిస్తోంది అని అంటున్నారు. నిజానికి అమరావతి రాజధానిని నిర్మిస్తామని విభజన చట్టంలో పెట్టినా దానికి కూడా పదేళ్ళ తరువాత రుణం మాత్రమే ఇప్పిస్తున్న కేంద్రం నుంచి ఉదారంగా నిధులను ఆశించడం అంటే అది తప్పే అవుతుంది అని అంటున్నారు.దాంతో హామీల విషయంలో తెలుగుదేశం పాట్లు ఏవో పడమని కేంద్రం చోద్యం చూస్తోంది అని అంటున్నారు. ఇక మేనిఫేస్టోనే తమ చేతుల్తో ముట్టని బీజేపీ నుంచి కేవలం హామీల కోసం నిధులు అడగడం కూడా టీడీపీకి అయ్యే పని కాదు అని అంటున్నారు. దాంతోనే కిందా మీద ప్రభుత్వ పెద్దలు అవుతున్నారు అని అంటున్నారు. ఒక వైపు రెండు నెలల వ్యవధి గడుస్తోంది. ఒక్క సామాజిక పెన్షన్లు తప్ప మరేమీ హామీని కూటమి నెరవేర్చలేదు. ఏ హామీ ముట్టుకున్నా షాక్ కొడుతుంది. పైగా విధి విధానాల దగ్గర తకరారు వస్తే అనుకున్నంతమంది లబ్దిదారులకు ఇవ్వకపోతే అది కూడా వైసీపీకి ప్లస్ అవుతుంది.అందుకే కొన్నాళ్ళు వాయిదా వేయడమే మంచింది అని కూటమి పెద్దలు ఉన్నారని అంటున్నారు.

# సీనియర్లను కట్టడి చేసేలా జగన్ వ్యూహం



అమరావతి,వైసీపీలో సీనియర్లు స్తబ్దుగా ఉన్నారు. వారు గత రెండు నెలలుగా మీడియా ముఖం చూడటం లేదు. అలాగే వారి మీద ప్రచారం కూడా వైసీపీ అధినాయకత్వాన్ని కలవరపెడుతోంది. కొందరు సీనియర్లు పార్టీ మారుతారు అని కూడా అంటున్నారు.ఈ నేపథ్యంలో పార్టీని పటిష్టం చేయడం సీనియర్లను కట్టడి చేయడం అనన్ రెండు అంచెల వ్యూహానికి జగన్ పదును పెడుతున్నారు అని అంటున్నారు. ఓటమి పాలు అయ్యాక ముఖం చాటేస్తున్న సీనియర్లతో చర్చలు జరిపి దారికి తెచ్చుకోవడంతో పాటు వారికే కీలకమైన పార్టీ బాధ్యతలు అప్పగించాలని జగన్ చూస్తున్నారు అని అంటున్నారు.మొత్తం 26 జిల్లాలలో పార్టీని పూర్తిగా ప్రక్షాళన చేయాలని ఆయన చూస్తున్నారు. జిల్లా అధ్యక్షులుగా సీనియర్లను నియమించాలని చూస్తున్నారు. అందులో మాజీ మంత్రులకు పెద్ద పీట వేయాలని ఆలోచిస్తున్నారుట. వారు అయితే అనుభవంతో పాటు పార్టీని నడిపిస్తారు అని భావిస్తున్నారుట.ఇందులో కూడా సామాజిక సమీకరణలను చూసుకుంటూ అన్ని విషయాలూ బేరీజు వేసుకుంటూ జగన్ సంచలన నిర్ణయాలే తీసుకుంటారు అని అంటున్నారు. ఈ మేరకు ఆయన పార్టీ ముఖ్యులతో చర్చిస్తున్నారని తెలుసోంది. తొందరలోనే ఏపీలోని మొత్తం ఇరవై ఆరు జిల్లాలకు కొత్త అధ్యక్షులను నియమించాలని జగన్ సన్నద్ధమవుతున్నారు.దీని వల్ల పార్టీకి కొత్త ఊపు రావడమే కాకుండా మరో నాలుగు నెలల సమయం ఇచ్చి టీడీపీ కూటమి మీద ప్రజా పోరాటానికి తెర తీయడానికి కూడా వీలు చిక్కుతుందని లెక్క వేస్తున్నారు. ఉత్తరాంధ్ర నుంచి చూసుకుంటే శ్రీకాకుళం జిల్లా అధ్యక్షునిగా ప్రస్తుతం ఉన్న ధర్మాన క్రిష్ణదాస్ స్థానంలో ప్రసాదరావుని నియమిస్తారు అని అంటున్నారు.ఆయన రాజకీయాలు వద్దు అని అనుకుంటున్నారు. అయితే ఆయనకు నచ్చ చెప్పి పార్టీ పగ్గాలు అప్పగించడం ద్వారా సిక్కోలులో వైసీపీని గాడిన పెట్టాలని అనుకుంటున్నారుట. అలాగే విజయనగరం జిల్లా పార్టీ పగ్గాలను మజ్జి శ్రీనివాసరావుకే ఇస్తూ ఆయననే కొనసాగిస్తారా లేక కొత్త పేరుని తెర మీదకు తెస్తారా అన్న చర్చ ఉంది.ఇక పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడిగా పీడిక రాజన్నదొరను నియమిస్తారని అంటున్నారు. విశాఖ జిల్లా అధ్యక్షుడిగా గుడివాడ అమర్నాథ్ లేదా అవంతి శ్రీనివాసరావు పేర్లను పరిశీలిస్తున్నారు అని తెలుస్తోంది. అనకాపల్లి జిల్లా అధ్యక్షుడిగా బూడి ముత్యాలనాయుడు పేరుని ముందు పెడుతున్నారు.అల్లూరి జిల్లాకు ప్రస్తుతం పాడేరు మాజీ ఎమ్మెల్యే కె భాగ్యలక్ష్మి అధ్యక్షురాలిగా ఉన్నారు. అక్కడ ఒక బలమైన నేతను బరిలోకి దింపి పగ్గాలు అప్పగించాలని చూస్తున్నారు. కాకినాడ జిల్లాకు కురసాల కన్నబాబు లేదా దాడిశెట్టి రాజాకు బాధ్యతలు అప్పగించాలని అనుకుంటున్నారుట. ఏలూరు జిల్లా అధ్యక్ష బాధ్యతలకు మాజీ మంత్రి ఆళ్ల నాని రాజీనామా చేయడంతో కొత్త వారిని తేవాలని చూస్తున్నారు. కోనసీమ అంబేద్కర్ జిల్లా బాధ్యతలు మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావుకి ఇవ్వాలని చూస్తున్నారుట.గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా అంబటి రాంబాబు, ఎన్టీఆర్ జిల్లా ప్రెసిడెంట్ గా జోగి రమేష్ కి బాధ్యతలు దక్కనున్నాయి. మచిలీపట్నం జిల్లా అధ్యక్ష బాధ్యతలు కొత్త ముఖానికి ఇస్తారని అంటున్నారు. ప్రకాశం జిల్లా అధ్యక్షుడిగా మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డిని నియమిస్తారని అంటున్నారు. నెల్లూరు బాధ్యతలు మాజీ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డికి ఇస్తారని తెలుస్తోంది.అలాగే తిరుపతి జిల్లా బాధ్యతలు దళిత వర్గానికి చెందిన నేతకు చిత్తూరు బాధ్యతలు బీసీ వర్గానికి ఇస్తారని టాక్ నడుస్తోంది. ఇక కడప కర్నూల్, నంద్యాల, అనంతపురం, సత్యసాయి జిల్లాల బాధ్యతలను కూడా సీనియర్లకు ఇవ్వాలని ఆలోచిస్తున్నారు.ఇక ఈ బాధ్యతలు అప్పగించడంతో ప్రాధాన్యతలు ఏమిటి అంటే అధినాయకత్వం పట్ల విధేయత, దూసుకుని పోయే విధంగా పనిచేసేవారు గా ఉండడం, జిల్లా స్థాయిలో అందరికీ ఆమోదయోగ్యమైన వారుగా ఉండడం. ఇవన్నీ పరిగణనలోకి తీసుకుని కొత్త జిల్లా అధ్యక్షులను వైసీపీ హై కమాండ్ తొందరలో నియమిస్తుందని అంటున్నారు.

# బీజేపీ నుంచి మంత్రి పదవి ఆఫర్...మిధున్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు



అమరావతి,పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి, వైసీపీకి ఉన్న స్ట్రాంగ్ యంగ్ లీడర్స్ లో ఒకరు. మూడు సార్లు రాజంపేట నుంచి ఎంపీగా గెలిచి హ్యాట్రిక్ కొట్టారు. వైసీపీకి లోక్ సభలో నాయకుడిగా వ్యవహరిస్తున్నారు. గతంలో ప్రొటెం స్పీకర్ గా కూడా లోక్ సభలో వ్యవహరించారు. జగన్ కి అత్యంత సన్నిహిత నేతలలో ఆయన ఒకరు. వైసీపీ భారీ ఓటమి తరువాత తొలిసారి ఒక యూట్యూబ్ చానల్ కి మిధున్ రెడ్డి పూర్తి స్థాయి ఇంటర్వ్యూ ఇచ్చారు.ఈ సందర్భంగా ఆయన మనసు విప్పి మాట్లాడారు. అనేక సంచలన విషయాలనూ వెల్లడించారు. మిధున్ రెడ్డి బీజేపీలోకి వెళ్లబోతున్నారు అంటూ వస్తున్న ఆరోపణల మీద ఆయన సరైన జవాబు చెప్పారు. ఈ ఆరోపణలను తానూ వింటున్నాను అని అన్నారు. తాను జగన్ ని పార్టీని నమ్ముకుని రాజకీయాల్లోకి వచ్చాను అని అన్నారు. జగన్ తనకు అనేక అవకాశాలు చిన్న వయసులోనే ఇచ్చారని గుర్తు చేశారు.రాజకీయం అన్నది అభిమానం మీద ఆధారపడి ఉంటుందని తాను తనకు జగన్ తో వైసీపీతో ఎమోషనల్ బాండేజ్ ఉందని అన్నారు. రాజకీయం అంటే వ్యాపారం కాదని ఆయన అన్నారు. నష్టాలు వచ్చాయని ఉన్న రాజకీయ పార్టీని వదిలేసి వేరే రాజకీయ పార్టీకి తాను వెళ్లే రకం కాదని అన్నారు. క్యారెక్టర్ ముఖ్యం అని ఆయన చెప్పారు.తాను బీజేపీలోకి వెళ్తున్నాను అన్న దానిని ఇపుడే కాదని 2014 టైంలోనూ ప్రచారం చేశారు అని మిధున్ రెడ్డి గుర్తు చేశారు. అప్పట్లో బీజేపీతో చేరితే కేంద్ర మంత్రి పదవి ఇస్తామని కూడా ఆఫర్ చేశారని అన్నారు. కానీ తాను ఆనాడూ వెళ్లలేదు, ఈనాడు వెళ్ళేది లేదని అన్నారు. తాను ఎప్పటికీ వైసీపీని విడిచిపెట్టి వెళ్ళేది లేదని అన్నారు.తమ కుటుంబం మీద వస్తున్న అవినీతి ఆరోపణలు అన్నీ బురదజల్లే కార్యక్రమంగా ఆయన తేల్చేశారు. అఫిడవిట్ లో ఏ అంశాలు పెట్టామో అవే మా ఆస్తులుగా ఉన్నాయని చెప్పారు. దానికి మించి సెంటు భూమి తమకు అదనంగా ఉందని నిరూపించినా రాజకీయాల నుంచి తప్పుకుంటామని సవాల్ చేశారు. మదనపల్లిలో ఫైల్స్ కాలిపోయాయని అంటూ తమ మీద నిందలు వేస్తున్నారని ఆయన అన్నారు.ఇపుడు టెక్నికల్ యుగం నడుస్తోందని ఫైలెస్ అన్నీ ఆన్ లైన్ లో ఉంటాయన్నది అందరికీ తెలుసు అన్నారు. ఎమ్మార్వో ఆఫీసులో ఫైల్స్ పోతే సాఫ్ట్ వేర్ లో ఉండవా అని ఆయన ప్రశ్నించారు. కేవలం విష ప్రచారం చేయడం కోసమే ఇదంతా అని ఆయన కొట్టి పారేశారు.చంద్రబాబుకు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి మధ్యన గొడ్వ ఏంటి అన్న దానిని బదులిస్తూ తన తండ్రి ఎస్వీ యూనివర్శిటీలో గోల్డ్ మెడల్ స్టూడెంట్ అని పీహెచ్ డీ పూర్తి చేసి రాజకీయాల్లోకి వచ్చారని అన్నారు. తన తండ్రికి చంద్రబాబు రెండేళ్ళు సీనియర్ అని చెప్పారు. మొదట కాలేజ్ చైర్మన్ గా చంద్రబాబు గెలిచారని ఆ తరువాత తన తండ్రి గెలిచారని అన్నారు.ఆనాటి నుంచే చంద్రబాబు ప్రత్యర్ధిగా తన తండ్రిని భావించారు అని అన్నారు. తన తండ్రి ఇప్పటికి పది సార్లు ఎన్నికల్లో పోటీ చేశారు కానీ ఎవరినీ ఒక్క రూపాయి బెదిరించి తీసుకున్నది లేదని అన్నారు. తమకు ఏపీతో పాటు అనేక రాష్ట్రాలలో అలాగే ఇతర దేశాలలో వ్యాపారాలు ఉన్నాయని మిధున్ రెడ్డి చెప్పారు. తాము న్యాయంగా వ్యాపారాలు చేస్తామని వాటి నుంచే తాము రాజకీయాలకు ఖర్చు చేస్తామని అన్నారు.రాజకీయాల నుంచి డబ్బులు దండుకుని జీవించే అవసరం తమకు లేదని ఆయన అన్నారు. మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డితో కూడా తమకు వైరం ఏమీ లేదని ఆయనకు ప్రజల్లో బలం లేదని అందుక తమను చూస్తే అసూయ అన్నారు. తాజా ఎన్నికల్లో రాజం పేటలో ఎనభై వేల ఓట్ల తేడాతో తన మీద కిరణ్ కుమార్ రెడ్డి ఓటమి పాలు అయ్యారని అక్కడ ఎమ్మెల్యేలుగా గెలిచిన కూటమి అభ్యర్ధుల కంటే కూడా కిరణ్ కుమార్ రెడ్డికి తక్కువ ఓట్లు వచ్చాయని అన్నారు.తాము ఎన్డీయేకు ఇండియా కూటమికి కూడా దూరం అని చెప్పారు మంచి పాలసీలు తెస్తే ప్రజా ప్రయోజనాల దృష్ట్యానే తాము బీజేపీ బిల్లులకు మద్దతు ఇచ్చామని అన్నారు. ట్రిపుల్ తలాఖ్ తో పాటు యూనిఫాం సివిల్ కోడ్ ని తాము వ్యతిరేకించామని ఆయన పేర్కొన్నారు. తాజాగా చూసినా వక్ఫ్ బోర్డు బిల్లుని తాము వ్యతిరేకించామని అన్నారు.వైసీపీలో కష్టపడి పనిచేసిన వారికే పదవులు ఇస్తారని ఆయన అన్నారు. తాను గానీ వైవీ సుబ్బారెడ్డి కానీ విజయ్ సాయిరెడ్డి కానీ మొదటి నుంచి పార్టీలో పనిచేసిన వారమని ఆయన గుర్తు చేశారు. వైసీపీ ఒక వర్గానికి అందలం ఎక్కించే పార్టీ కాదని అన్నారు. తాము ఎన్ని మంచి పనులు చేసినా కొన్ని తప్పులు కూడా జరిగి ఉంటాయని వాటిని తాము తెలుసుకుని సవరించుకుంటామని అన్నారు. జగన్ తమకు బలమని జగన్ నాయకత్వంలో మళ్లీ వైసీపీ బలం పుంజుకుంటుందని అన్నారు.చంద్రబాబు ఇచ్చిన అన్ని హామీలు అమలు చేస్తే స్వాగతిస్తామని కానీ ఆయన హామీలు నెరవేర్చకపోతే మాత్రం ప్రజల పక్షాన నిలబడి పోరాడుతామని అన్నారు. రెండు నెలలలోనే ప్రజలకు కూటమి ప్రభుత్వం తీరు ఏమిటో అర్ధం అయిందని మిధున్ రెడ్డి అన్నారు. ఏపీలో కాంగ్రెస్ పార్టీ అన్నది లేదని ఆయన మరో కామెంట్ చేశారు. వైసీపీని దెబ్బ తీయడానికి కాంగ్రెస్ అభ్యర్థులను గత ఎన్నికలో బీ ఫారాలు ఇప్పించి మరీ పెట్టించిందే టీడీపీ అని ఆ పార్టీల మధ్య అవగాహన ఉందని మిధున్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు.

# డబుల్ ట్రబుల్...

కరీంనగర్ : డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం పూర్తికాక, పూర్తైన ఇళ్ళు లబ్ధిదారులకు పంపిణీ చేయక అలంకార ప్రాయమయ్యాయి. నిరుపేదలు అందులో నివసించక ముందే శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. డబుల్... ట్రబుల్ గా మారి నిరుపేదల స్వంతింటి కళ నెరవేరని పరిస్థితి నెలకొంది.ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ళలో 25815 డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళు మంజూరు చేసింది. అందులో 10 వేల 92 ఇళ్ళ నిర్మాణం పూర్తయ్యాయి. కానీ కేవలం 1520 ఇళ్ళు మాత్రమే లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పంపిణీ చేసిన చోట అనర్హుల పేర్లు జాబితాలో చేర్చి డ్రా తీశారనే విమర్శలు వెల్లువెత్తాయి. మరో 7513 ఇళ్ళ నిర్మాణమే చేపట్టలేదు. నిర్మాణాలు చేపట్టిన చోట చాలా వరకు పిల్లర్లు, స్లాబ్ దశలోనే ఉన్నాయి. మరికొన్ని చోట్ల చివరి దశ పనుల్లో ఆగిపోయాయి.కరీంనగర్ సమీపంలోని చింతకుంట శివారులో ఏడు బ్లాకుల్లో ఆరు అంతస్థులతో అపార్ట్మెంట్ టైప్ లో 666 డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళను నిర్మించారు. నిర్మాణ పనులు పూర్తికాక బూత్ బంగ్లాలుగా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారాయి. అధికారుల నిర్లక్ష్యం పాలకుల పర్యవేక్షణ లోపంతో కొన్ని పునాదులకే పరిమితం కాగ, మరికొన్ని పూర్తైన లబ్ధిదారులకు అందక నిరూపయోగంగా మారాయి. అసంపూర్తిగా ఉన్న పనులు వెంటనే పూర్తి చేసి నిరుపేదలకు అప్పగించాలని నిరుపేదలతోపాటు వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.అసంపూర్తిగా, నిరూపయోగంగా మారిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళను సిపిఎం నాయకులు సందర్శించి అక్కడి వాస్తవిక పరిస్థితులను పరిశీలించి ఆందోళన వ్యక్తం చేశారు. అందమైన భవనాలు చెత్తాచెదారంతో తాగుబోతులకు అడ్డాగా అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా ఉండడం చూసి అధికారుల తీరు పాలకుల వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పై దృష్టి పెట్టి తక్షణమే పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు కేటాయించాలని నగర సిపిఎం కార్యదర్శి



గుడికందుల సత్యం డిమాండ్ చేశారు. లేదంటే సిపిఎం ఆధ్వర్యంలో పేదలను సమీకరించి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళను ఆక్రమిస్తామని హెచ్చరించారు.డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం, పంపిణీ నత్తనడకన సాగడానికి అధికారుల నిర్లక్ష్యం పాలకుల పర్యవేక్షణ లోపమే కారణమని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పాలకులు మారిన పట్టించుకునే వారు కానరాక పూర్తయిన ఇళ్ళు నిరూపయోగం గా మారి శిథిలావస్థకు చేరుకుంటున్నాయి.పూర్తయిన ఇళ్లకు కాంట్రాక్టర్ కు చెల్లించాల్సిన డబ్బులు ప్రభుత్వం చెల్లించకపోవడంతో పలు చోట్ల పనులు నిలిచిపోగా మరికొన్ని చోట్ల మంజూరై, నిర్మాణం చేపట్టిన ఇళ్ళు తక్కువ, ఇళ్ళ కోసం దరఖాస్తు చేసుకున్న వారి సంఖ్య ఎక్కువగా ఉండడంతో లబ్ధిదారుల ఎంపిక చేయడంలో ఎమ్మెల్యేలు మీనమేషాలు లెక్కిస్తున్నారు.ఏదేమైనా డబ్బుల్ బెడ్ రూమ్ ఇళ్ళు ట్రబుల్ గా మారి నిరుపేదల పాలిట శాపంగా పరిణమిస్తుందని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.ఇప్పటికైనా అధికారులు పాలకులు మేల్కొని అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వాలని సర్వత్రా డిమాండ్ వ్యక్తం అవుతోంది. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని మనం కోరుకుందాం.

# అంటువ్యాధులకు తోడు జ్వరాలు



విజయవాడ,వర్షాలు తగ్గి వరద నుంచి కోలుకుంటున్న ప్రజలకు అంటువ్యాధులు తప్పడం లేదు. దీనికితోడు ఇప్పుడు ఎక్కడ చూసినా ప్రజల జ్వరాలతో బాధపడుతున్నారు. సామాన్య జ్వరాలా లేక డెంగ్యూ లాంటి జ్వారాలో అర్థం కాక హైరానా పడుతున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఇప్పుడు జ్వరపీడితులు ఎక్కువయ్యారు. వైరల్ ఫీవర్తో పాటు కీళ్ల నొప్పులతో అస్పత్రులు చుట్టూ తిరుగుతున్నారు. నిన్నటి వరకు వర్షాలు, వరదలతో ఉక్కిరిబిక్కిరైన జనం ప్రస్తుతం వైరల్ జ్వరాలతో తల్లడిల్లుతున్నారు. గత కొద్దిరోజుల నుంచి అనేక గ్రామాల్లో దగ్గు, జలుబులు తీవ్రరూపం దాల్చడమే కాకుండా చాలా మంది జ్వరాల బారిన పడుతున్నారు. అధికారులు వైరల్ ఫీవర్లుగా అధికారికంగా పేర్కొంటున్నప్పటికీ లక్షణాలు మాత్రం మలేరియా, టైఫాయిడ్లను పోలినట్లుగానే ఉంటున్నాయి. జ్వరాలు జనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. జ్వరాల తీవ్రత పెరుగుతుండడంతో వైద్య,ఆరోగ్యశాఖ అప్రమత్తమై మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేసింది. వైద్య,ఆరోగ్యశాఖ అధికారులు గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నప్పటికి పారిశుధ్య సమస్య కారణంగా వైరల్ జ్వరాలు విభృంభిస్తున్నాయంటున్నారు. వాతావరణం లో వేడితీవ్రత తగ్గకపోవడం అలాగే వర్షాల కారణంగా నీరు నిలిచి ఉంటున్నందున ఈగలు, దోమలు వృద్ధి చెందిన వైరల్ జ్వరాలతో పాటు డయేరియా లాంటి రోగాలు విస్తరిస్తున్నాయంటున్నారు. అలాగే జ్వరాలకు తోడుగా దగ్గు, జలుబు కూడా సాధారణ ప్రజానీకాన్ని సతమతం చేస్తోంది. కొన్ని రోజుల నుంచి ఓ వైపు జ్వరాలు, మరోవైపు డయేరియా, దగ్గు, జలుబు లాంటివి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుండడంతో ప్రైవేట్ ఆస్పత్రులకు జ్వర బాధితులు క్యూ కడుతున్నారు. వైద్య,ఆరోగ్యశాఖ రక్త పరీక్షల నమూనా శిబిరాలను సైతం చేపట్టింది. చాలా ప్రైవేటు ఆసుపత్రులు జ్వర బాధితులతో కిటకిటలాడు తున్నాయి. ప్రైవేటు ఆసుపత్రుల ల్యాబోరేటరీల్లో మాత్రం టైఫాయిడ్, మలేరియాలు కూడా నిర్దారణ అవుతున్నట్లు చెబుతున్నారు. వరద ప్రాంతంతో పాటు పలు గ్రామాల్లో దోమల మందులను పిచ్కారి చేయడం, బ్లీచింగ్ పౌడర్ చల్లడం లాంటి చర్యలను చేపడుతు న్నప్పటికి పారిశుధ్య సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు. మురికి కాలువలతో పాటు గుంతల్లో నిలిచిపోయిన నీటికారణంగా ఈగలు, దోమలు తీవ్రంగా ప్రబలుతున్నాయంటున్నారు. అలాగే పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత లోపంతో కూడా జ్వరాలు తీవ్రంగా విస్తరించడానికి కారణమవున్నాయని వైద్యాధికారులు పేర్కొంటున్నారు. మరో రెండు నెలల పాటు అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోనట్లయితే ఈ జ్వరాలు మరింత తీవ్రరూపం దాల్చే ప్రమాదం లేకపోలేదంటున్నారు.

# బొత్స పోటీ వెనుక వ్యూహం...



విశాఖపట్టణం,: విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా బొత్స సత్యనారాయణ పేరును జగన్ ప్రకటించడం వైసీపీలోనే చర్చనీయాంశం అవుతోంది. దీనికి కారణం అసలు బొత్స సొంత గూడు కాంగ్రెస్‌లోకి వెళ్లే ప్రయత్నాల్లో ఉన్నారన్న ప్రచారం జరుగుతున్న సమయంలో ఈ అభ్యర్థిత్వానికి అంగీకరించడమే. బొత్స కూడా పోటీకి సుముఖత వ్యక్తం చేయలేదని కానీ జగన్ కార్పొరేటర్లతో మీటింగ్ పెట్టి పిలిచి బలవంతంగా అంగీకరింప చేసి ప్రకటించారని అంటున్నారు.ఓటమి తరువాత బొత్స పెద్దగా మీడియా ముందుకు కూడా రావటం లేదు. వచ్చినా నామ మాత్రంగా ప్రెస్ మీట్ పెట్టేసి ముగించేస్తున్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా పోటీచేసేందుకు ఆయన సిద్ధంగా లేకపోయినా జగన్ తీవ్ర ఒత్తిడి తీసుకువచ్చి ఒప్పించినట్లు వైసీపీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి మొత్తం 841 ఓట్లు ఉన్నాయి. ఇందులో వైసీపీకి 615 ఓట్లు, అధికార కూటమికి 215 ఓట్లు ఉన్నాయి. ఎన్నికల ముందు, కూటమిప్రభుత్వం ఏర్పడిన తరువాత ఉమ్మడిజిల్లాకు చెందిన చాలా మంది వైసీపీ కార్పొరేటర్లు, మున్సిపల్ కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్లు తెలుగుదేశం తీర్థం పుచ్చుకున్నారు. వీరంతా స్థానిక సంస్థల శాసనమండలి ఓటర్లే. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బొత్సను పోటీలోకి దింపితే పెద్ద సంఖ్యలో వైసీపీని వీడుతున్న ప్రజా ప్రతినిధులను కట్టడి చేయవచ్చన్నది జగన్ ఉద్దేశం. ఉమ్మడి జిల్లాలోని చాలా మంది వైసీపీ ప్రజా ప్రతినిధులు బొత్స అభ్యర్థిత్వం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇన్నాళ్లూ బొత్స, ఆయన కుటుంబం అనేక పదవులు అనుభవించారనీ, ఎన్నికల్లో ప్రజలు గట్టి గుణపాఠం చెప్పినా మళ్లీ బొత్సకు ఎమ్మెల్సీ అవకాశం ఇవ్వడం ఏమిటని అధికశాతం వైసీపీ ప్రజా ప్రతినిధుల ప్రశ్న. ఇప్పటికే వందనంకాకపోగా స్థానిక సంస్థలకు చెందిన వైసీపీ ప్రజాప్రతినిధులు ఆ పార్టీని వీడి తెలుగుదేశం, జనసేన పార్టీల్లో చేరిపోయారు. మరో 200 మంది తెలుగుదేశంలో చేరేందుకు సిద్ధమైనట్లు వైసీపీ వర్గాలే చెబుతున్నాయి. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో నిలిచేందుకు బొత్స సత్యనారాయణ కూడా తొలుత అంగీకరించలేదని బొత్స కాంగ్రెస్ పార్టీలోకి వెళ్తారన్న ప్రచారం జరుగుతుండటంతో ఎలాగైనా బొత్సను ఎమ్మెల్సీ బరిలో నిలిపి పార్టీ మారకుండా కళ్లెం వేయాలన్నది జగన్ ప్లాన్ గా వైసీపీ నేతలు చెబుతున్నారు. బొత్స సత్యనారాయణ ఇప్పటికే కేంద్రంలోని కాంగ్రె స్ పెద్దలతో టచ్ లో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. రాహుల్ గాంధీకి దగ్గర వ్యక్తులుగా ఉన్న కొందరు నేతలు కాంగ్రెస్ పార్టీలోకి వచ్చి షర్మిల ఆధ్వర్యంలో పని చేయాలని బొత్సకు సూచించినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో వైసీపీకోలుకునే పరిస్థితి లేదని భావించిన బొత్ససత్యనారాయణ కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సానుకూలంగా ఉన్నారని అంటున్నారు.ఈ విషయం తెలుసుకున్న జగన్ మోహన్ రెడ్డి, బొత్సను బలవంతంగా ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు ఒప్పించారనివైసీపీ వర్గాలే చెబుతున్నాయి.అన్నీ నేను చూసుకుంటానని బొత్సను జగన్ బరిలోకిదింపారు. జగన్ మాట తీసేయలేక అయిష్టంగానే బొత్స పోటీకి సరే అన్నారనివిశాఖ ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో టాక్ నడుస్తోంది. విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికను తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. దీంతో బొత్సను ఓడించేందుకు తెలుగుదేశం వ్యూహాలు రచిస్తోంది. సాయంత్రం పల్లా శ్రీనివాస్ నివాసంలో అయ్యన్న పాత్రుడు, సీఎం రమేష్, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు భేటీ అయ్యారు.

# ఎందుకు చిన్నమ్మా.. పనిలేని పనులు..!

అమరావతి,పులిని చూసినక్క వాతలు పెట్టుకున్నట్టుగా ఉంది.. రాష్ట్రంలో బీజేపీ పరిస్థితి. టీడీపీ, జనసేనలు ప్రజల సమస్యలు వింటూ.. వారి నుంచి వినతులు తీసుకుంటున్నాయి. టీడీపీ ప్రజా దర్బార్ పేరుతోను, జనసేన జన వాణి పేరుతోనూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. దీనికి పుంఖాను పుంఖాలుగా ప్రజలు తమ వినతులు సమర్పిస్తున్నారు. పెద్ద ఎత్తున క్యూలు కూడా కడుతున్నారు. అయితే.. దీనిని చూసి బీజేపీ కూడా ఇప్పుడు సారథి పేరుతో ఈ నెల 15 నుంచి ప్రజల నుంచి వినతులు తీసుకునే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.దీనిని పెద్ద గొప్పగా కూడా ప్రచారం చేసుకుంటోంది. కానీ, అసలు విషయం ఏంటంటే.. ఇన్నాళ్లలో బీజేపీ నాయకులకు ప్రజల సమస్యలు తెలియవా? అనేది. పైగా.. ప్రజల సమస్యలు తెలుసుకుని ఏం చేస్తారు?అంటే.. మళ్లీ రాష్ట్ర సర్కారుకే విన్నవించి.. చంద్రబాబు ద్వారా ఆయా సమస్యలు పరిష్కరించే ప్రయత్నం చేస్తామని కమల నాథులు చెబుతున్నారు. ఇంతోటి దానికి పెద్ద ఎత్తున హంగామా ఎందుకు? ఎలానూ టీడీపీ ఇదే పనిచేస్తోంది. కూటమి పార్టీ జనసేన కూడా ఇదే పని చేపట్టింది. మరి బీజేపీతో పనేంటి?అయినా.. బీజేపీ చేయాల్సిన పని వేరేగా ఉందని అంటున్నారు. రాష్ట్రంలో ప్రజల వ్యక్తిగత ఫిర్యాదులు తీసుకునేందుకు, వారి సమస్యలు వినేందుకు నేరుగా చంద్రబాబు రంగంలోకి దిగిన తర్వాత.. అసలు వేరే పార్టీలకు కూడా పనిలేదు. పోనీ.. కేంద్రంలో అధికార కూటమిలో ఉన్నా.. అధికారంలో అయితే.. ప్రత్యక్షంగా లేనందున జనసేన పట్టించుకుందంటే ఒక అర్థం ఉంది. పైగా ఇది ప్రాంతీయ పార్టీ. కానీ, జాతీయ పార్టీగా, కేంద్రంలో అధికారంలో



ఉన్న పార్టీకి బీజేపీ చేయాల్సింది కూడా.. ఈ కాపీ కార్యక్రమమే నా?అసలు ఇప్పుడు బీజేపీ చేయాల్సిన పని.. ప్రజల కోసం కాదు. రాష్ట్రం కోసం. కేంద్రం నుంచి తీసుకురావా ల్సిన నిధులపై రాష్ట్రం తరఫున వాయిస్ వినిపించాలి. విశాఖ స్టీల్ ప్లాంట్ వ్యవహారం తేల్చాలి. కడప ఉక్కు ఫ్యాక్టరీని నిర్మించాలి. అదేసమయంలో వెనుకబడిన జిల్లాలకునిధులు తీసుకురావాలి. కేంద్రం నుంచి ఒనగూర్చాల్సిన ప్రయోజనాలు రాబట్టాలి. నీటి వివాదాలపై ప్రయత్నించాలి. వీటిని వదిలేసి.. ఏదో చేస్తున్నామంటే.. చేస్తున్నామన్నట్టుగా.. కంటితుడుపు కార్యక్రమాలు, కాపీ కొట్టే కార్యక్రమాలతో ప్రయోజనం ఏంటనేది పురందేశ్వరికి ఎదురవుతున్న ప్రశ్నలు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com